18032025-DIS-06_Layout 1 3/18/2025 4:01 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

అసలు రంగు తేలిపోయింది

కల్లబొల్లి కబుర్లతో అధికారంలోకి వచ్చినవారు నిఖార్సయిన పాలన ఎలా అందించగలరు? మాయమాటలతో ఓటును కాజేసిన వారు హామీలను ఎలా నిలబెట్టుకోగలరు? 'హస్తవ్యస్త' పాలనలో రాష్ట్రం ఓ 'బొంకుల' దిబ్బగా మారింది. ఏదో పొడిచేస్తామని గద్దెనెక్కినవారు ఇరికి ఇగిలిస్తున్నారు. నీలంరంగు గుంటనక్క నీళ్లల్లో తడిసి అసలు రంగు బయటపడిన తర్వాత ఆకలి కోసం మోసం చేశానంటుంది. ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి కూడా అదే తరహాలో మాట్లాడుతున్నారు. చెరువులో బియ్యం పోసి చెరువు కింద మంట పెట్టి ఊరందరికీ కుడుపు పెడతా అని ఏతులు చెప్పే తుపాకీ రాముడు అవన్నీ చెయ్యడని ప్రజలకు తెలుసు. అది వినోదం. ఇక్కడ హామీలు, గ్యారంటీలంటూ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన మాటను తప్పడం విషాదం.

'అధికారం కోసం ఏవేవో ఇస్తామని చెప్పాం.. అవన్నీ ఎక్కడ నుంచి తెమ్మంటారని' గడుసుగా ఎదురుప్రశ్న వేస్తున్నారు ఈ ముఖ్యమంత్రి. బీఆర్ఎస్‌ను తిడుతూ కాలక్షేపం చేయడం ఇంక వీలుకాని పరిస్థితి వచ్చింది. 'వారు అప్పు చేస్తే తప్పు మీరు చేస్తే ఒప్పా?' అని ప్రజలు నిలదీస్తున్నారు. ఇప్పటిదాకా లక్షన్నర కోట్లకు పైగా అప్పు తెచ్చారు. మరో లక్షన్నర కోట్లకు చీటీ రాసి పంపుతున్నారు. కొత్త ప్రాజెక్టులు కట్టడం మాట దేవుడెరుగు.. బీఆర్ఎస్ కట్టిన ప్రాజెక్టులను ఉపయోగించుకోవడమూ చేతకాక రాష్ట్రాన్ని ఎండబెడుతున్నారు. కొన్నిప్రాజెక్టుల్లో అయితే నిర్వహణకు అవసరమైన అయిదారు కోట్లు చెల్లించలేక ఎత్తిపోతల మూలకు పడుతున్నది. మరి అన్నేసి కోట్ల అప్పులు తెచ్చి ఏ అడుగులేని బాయిలో పోస్తున్నారో తెలియడం లేదు. 'జీతాలు ఇవ్వడానికే డబ్బులు లేవు డీఏలు అడగకండి' అని ఉద్యోగుల దగ్గర బీద అరుపులు వినిపిస్తున్నారు ముఖ్యమంత్రి. ఏడాదిలోనే ఇంతగా భ్రష్టు పట్టిపోయిన రాష్ట్రాధినేత మరొకరు ఉండరేమో. ఇదేమని అడిగితే బుకాయింపులతో కొంతకాలం, దబాయింపులతో మరికొంత కాలం నెట్టుకువస్తున్నారు. అక్కను, ఉచ్చిలి కలగలిసిన ధోరణిలో స్వరాష్ట్ర సాధకుడు కేసీఆర్‌పై ఆయన పేలిన అవాకులు చవాకులైతే పరాకాష్ఠ. ఆ పదవికే అప్రదిష్ట. పాలనలో లోపాలను ఎత్తి చూపుతున్న జర్నలిస్టుల మీదా బజారు భాషే.

'బూతాడక దొరకు నవ్వు పుట్టదు ధరలో' అన్నట్టు మన సీఎం రేవంత్ రెడ్డికి అపసవ్యపు మాటలు మాట్లాడటమంటే చాలా సరదా. క్షుద్ర పదవిన్యాసంలో సంస్కారం సన్యాసం పుచ్చుకుంది. అన్ని హద్దులూ చెరిగిపోయాయి. అన్ని మర్యాదలూ గాలికెగిరిపోయాయి. పెద్దాచిన్నా తేడా లేకుండా గాయిది మాట్లాడటం సంస్కారం కాదని ఆయనకు ఎవరు చెప్పాలి? ఈయనకు పరిపాలన చేతకాదని ఎవరూ విప్పిచెప్పాల్సిన అవసరం లేదు. ప్రజలకు అది స్వానుభవమైపోయింది. మోసపోయి గోసపడుతున్నామని, పాడియావును అమ్మి దున్నపోతును తెచ్చుకున్నామని వారికి ఎప్పుడో తెలిసిపోయింది. 'సీఎం రేవంత్ స్టేచర్' ఏమిటో వారే చెప్తారు. ఆయన సర్కారును మార్చురీకి ఎప్పుడు పంపాలో వారే నిర్ణయిస్తారు. అందుకు సరైన అదును కోసం ఎదురు చూస్తున్నారు.

గౌరవ శాసనసభకు విన్నపం

సింగరేణి ప్రైవేటు వద్దు!

సింగరేణిలో ఇప్పటికే గనులను వేలం వేస్తుండగా, తాజాగా మరో కుట్రకు తెరలేచింది. సంస్థలో అత్యంత కీలకమైన సెక్యూరిటీ వింగ్ (రక్షణ విభాగం), మెడికల్ వింగ్ (వైద్య విభాగం)ను ప్రైవేట్‌వ్యక్తుల చేతుల్లో పెట్టేందుకు నిర్ణయించింది. ఈ నిర్ణయం సింగరేణి సంస్థ భద్రతకు అత్యంత ప్రమాదకరం. కార్మికుల ఉద్యోగ భద్రతకు పెనుముప్పు.

సింగరేణి సంస్థలో అనేక విభాగాలున్నాయి. అందులో కీలకమైనది సింగరేణి సెక్యూరిటీ అండ్ ప్రొటెక్షన్ కార్ప్స్ (ఎస్అండ్‌పీసీ) విభాగం. సింగరేణిలో ప్రస్తుతం 11 ఓపెన్ కాస్ట్ గనులు, 22 భూగర్భ గనులున్నాయి. వాటికి తోడు అనేక విభాగాలున్నాయి. వాటన్నింటిలో బొగ్గు, కోట్లాది విలువైన యంత్ర పరికరాలు, స్క్రాప్ ఇతర సామగ్రి అపహరణకు గురికాకుండా, సంస్థకు సంబంధించిన విలువైన భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించే బాధ్యత రక్షణ విభాగానిది. ప్రతీ గనికి, ఏరియాకు సంబంధించి ఒక సెక్యూరిటీ ఆఫీసర్ ఉండగా, వారందరికీ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ నేతృత్వం వహిస్తూ ఉంటారు. కార్మికుల భద్రతను కూడా పర్యవేక్షిస్తుంటారు. ఇలాంటి అత్యంత కీలకమైన ఆ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా ప్రైవేట్ వ్యక్తిని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించడమే కాదు, ఆ పోస్టు భర్తీకి నోటిఫికేషన్ జారీచేసింది. సింగరేణి సంస్థలో పనిచేసిన అనుభవం, గనుల్లో పనితీరుపై ఏ మాత్రం అవగాహన లేని, బయటివ్యక్తులను విభాగాధిపతిగా నియమించాలనుకోవడం సరికాదు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.

సింగరేణి సంస్థలో 'మెడికల్ విభాగం' కూడా కీలకమైనదే. కార్మికులకు మెరుగైన వైద్య సేవలందించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. సంస్థలోని కార్మికుల పని చేసే సామర్థ్యాన్ని కూడా నిర్ధారించి, సర్టిఫికెట్ ఇస్తుంది. ఈ సర్టిఫికెట్ ఆధారంగానే కార్మికులను ఉంచాలా, తొలగించాలనేది నిర్ణయిస్తారు. అత్యంత కీలకమైన ఈ విభాగానికి సంబంధించి అధిపతిని కూడా ప్రైవేట్ వ్యక్తినే నియమించాలని సింగరేణి సంస్థ నిర్ణయించడం సరికాదు. చీఫ్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ పోస్టును కాంట్రాక్టు పద్ధతిలో నియమించేందుకు ఉద్యోగ ప్రకటనను జారీచేసింది. అయితే అన్‌ఫిట్ సర్టిఫికెట్లను అడ్డం పెట్టుకుని కార్మికులను తగ్గించే కుట్రలో భాగంగానే చీఫ్ ఆఫ్ మెడికల్ ఆఫీసర్‌గా ప్రైవేట్ వ్యక్తిని నియమించేందుకు పూనుకున్నదనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ రెండు నిర్ణయాలపై పునరాలోచించాలి. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలి.

నిశితంగా పరిశీలిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక వ్యూహాత్మకంగా సింగరేణిని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి తీసుకువెళ్లడానికి అడుగులు వేస్తున్నాయన్నది తేటతెల్లమవుతున్నది. ఇకనైనా సింగరేణి యాజమాన్యం తన నిర్ణయాన్ని సమీక్షించుకోవాలి. ప్రైవేట్ వ్యక్తులకు కాంట్రాక్ట్ పద్ధతిలో విభాగాధిపతులకు అప్పగించడం వంటి పనులను వీడనాడాలి. ప్రైవేటు వ్యక్తుల ఆధిపత్యంలోకి సింగరేణి సంస్థ వెళ్లకుండా ఆదిలోనే అడ్డుకోవాలి. ప్రైవేట్‌వ్యక్తుల నియామకానికి సంబంధించిన నోటిఫికేషన్‌ను సంస్థ, ప్రభుత్వం తక్షణమే రద్దుచేయాలి.

- కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఎంవోఏఐ)

రేవంత్ రెడ్డి 'ఆత్మకథ' నోట్స్..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 12న రవీంద్రభారతిలో మాట్లాడుతూ గొప్పమాట ఒకటన్నారు. 'తాను అబద్ధాల ప్రాతిపదికన రాష్ట్రాన్ని నడపబోనని, వాస్తవాలను చెప్పి తెలంగాణను ప్రగతిపథంలోకి నడిపించేందుకు కృషిచేస్తా'నని ప్రకటించారు. అటువంటి స్పష్టతకు ఆయనను అభినందించాలి. ఆ మాట విన్నప్పుడు ఒకటనిపిస్తున్నది. రేవంత్ రెడ్డి ఎప్పటికైనా తన 'ఆత్మకథ' రాయాలి. లేదా మరెవరి చేతనైనా తన 'జీవిత కథ'ను రాయించాలి. ఎందుకంటే, గొప్పవారందరి విషయంలోనూ అది జరుగుతుంది. ఆ కథలు భవిష్యత్తు తరాలకు మార్గదర్శనం చేస్తూ స్ఫూర్తిదాయకమవుతాయి. అయితే, తను రాసినా, ఇతరులు ఆ పనిచేసినా అందుకు ఉపయోగపడేట్టు ఆయన 'ఆత్మకథ' నోట్స్ మాత్రం ఎప్పటికప్పుడు రాసి పెట్టుకోవాలి.

టంకశాల అశోక్

ఇప్పుడు రేవంత్‌రెడ్డి రవీంద్ర భారతి ప్రకటనకు వెళ్దాము. ఆ సందర్భం ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేయటం. టీచర్లు పిల్లలకు చెప్పే ముఖ్యమైన నీతి పాఠాలలో ఒకటి, 'అసత్యములాడరాదు' అని. బహుశా దానిని దృష్టిలో ఉంచుకునే కావచ్చు ఆయన అబద్ధాల ప్రాతిపదికన రాష్ట్రాన్ని నడపబోనన్నారు. అట్లాగే, టీచర్లు ఉద్యోగులు గనుక వారి జీతభత్యాల చెల్లింపు సమస్యల విషయాన్ని ప్రస్తావిస్తూ, రాష్ట్ర ఆర్థిక వ్యవహారాలు వారికే అప్పజెప్తామని, దేనికెంత పంచాలో వారే చెప్పాలన్నారు. సమస్యలకు కారణం గత ప్రభుత్వం రూ. 7 లక్షల కోట్ల రుణ భారం మిగిల్చిపోవటమని మరొక మారు యథావిధిగా ఆరోపించారు. మరొక ఐదు రోజుల తర్వాత రూ.8 లక్షల కోట్లకు పెంచారు.

ఈ సందర్భాలను పురస్కరించుకొని భవిష్యత్తులో తన 'కథ' కోసం నోట్స్ ఈ విధంగా రాసుకోవాలి. 'నేను 2025 మార్చి 12న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో టీచర్ల నియామక పత్రాలు అందజేసే కార్యక్రమంలో మాట్లాడుతూ, అబద్ధాల ప్రాతిపదికన రాష్ట్రాన్ని నడపబోనని అన్నాను. అదే సభలో, బీఆర్ఎస్ ప్రభుత్వం ఏడు లక్షల కోట్లు అప్పుచేసిందని కూడా అన్నాను. అట్లా ఎన్నిసార్లు అబద్ధమాడానో లెక్కలేదు. కానీ, అప్పులు అందులో సుమారు సగం మాత్రమేనని రిజర్వ్ బ్యాంక్ అప్పటికే గణాంక వివరాలతో స్పష్టం చేసింది. అయినప్పటికీ నేను ఆ స్పష్టీకరణ తర్వాత కూడా అదే అబద్ధం చెప్తూ పోయాను. నన్ను బట్టి నా ఇతర మంత్రులు, మా కాంగ్రెస్ నాయకులు కూడా అదే పని చేశారు. 7 లక్షల కోట్లు నిజం కాదని నాకు రవీంద్రభారతి కార్యక్రమం కన్నా ముందే కూడా తెలుసు. కానీ, రాజకీయాలలో ఎన్నికలు గెలవటం కోసం అబద్ధాలు ఆడవలసివస్తుందని, ప్రజలు కూడా అబద్ధాలను నమ్మి ఓటేసే పరిస్థితి ఉందని నేను గతంలో ఒకసారి అన్నాను. అదే మాట ప్రకారం టీచర్లను నమ్మించేందుకు రవీంద్ర భారతిలో మరొకమారు అబద్ధమాడాను. నా అబద్ధాలు నమ్మనందున టీచర్ల ఎమ్మెల్సీకి మేము ఓడిపోయామన్నది వేరే విషయం. అయినప్పటికీ ఆ తర్వాత కూడా ఆడాను. బహుశా ఇంకా తర్వాత సైతం ఆడవలసి రావచ్చునని అప్పుడే అనుకున్నాను. ఎందుకంటే, నిజం ఒప్పుకున్నట్లయితే ప్రజల నుంచి హామీల అమలు ప్రశ్నలు మరింత తీవ్రమవుతాయి. అందుకు సమాధానం నా వద్ద గాని, నా ప్రభుత్వం వద్ద గాని లేదు. మరొకటి చెప్పాలి. అప్పులు ఏడు లక్షల కోట్లు కాదని, దానిపై బహిరంగ చర్చకు సిద్ధమని బీఆర్ఎస్ నాయకులు పలుమార్లు సవాలు చేశారు. కానీ, నేను ముందుకురాలేదు. అందుకు కారణం చెప్పనక్కరలేదు. అందరూ గ్రహించగలదే. రవీంద్ర భారతిలో ఉండిన టీచర్లకు సహజంగానే అర్థమై ఉంటుంది.

> అదే కార్యక్రమంలో నేను ఉద్యోగుల వేతనాల చెల్లింపు సమస్యలను ప్రస్తావించాను. గత ప్రభుత్వం వేతనాలు, డీఏలు వగైరా సమయానికి చెల్లించటం లేదని ఎన్నికల ప్రచారంలో చాలా చెప్పాను. అధికారానికి వచ్చినట్టయితే అన్ని చెల్లింపులు సక్రమంగా చేస్తామన్న హామీ ఇచ్చి గెలిచాను. ఇప్పుడు ఆ ప్రకారం చేయలేకపోతున్నాను. ఆ నిందను గత ప్రభుత్వంపైకి తోయక తప్పదు కదా. కనుక, కొంతకాలంగా చేస్తున్న ఆ పనిని రవీంద్ర భారతిలోనూ చేశాను. అట్లా చేయటం వల్ల నా అప్పుల అబద్ధానికి బలం చేకూరుతుంది. కానీ, హామీల అమలుకు ఇపుడు టీచర్లు, ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారన్నది వేరే విషయం.

నా ఆత్మకథలో వివరించవలసిన విషయాలు ఇటువంటివి అనేకం ఉన్నాయి. అవన్నీ ఇక్కడ రాయటం సాధ్యం కాదు గనుక ముఖ్యమైనవి కొన్ని చెప్తాను. అన్నింటికన్న ముందు మాట్లాడుకోవలసింది, అబద్ధాల ప్రాతిపదికన రాష్ట్రాన్ని నడపబోనని రవీంద్రభారతిలో ఎంతో గంభీరంగా ప్రవచించిన నేను, అసలు అధికారానికి వచ్చిందే అబద్ధాల ప్రాతిపదికన. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన గురించి ఏడు లక్షల కోట్ల అప్పులన్న తరహాలోనే తోచిన అబద్ధమల్లా ఆడటం ఒక్కటైతే, అమలు చేయలేమని తెలిసినా అధికారం కోసం ప్రజలను మభ్యపెట్టేందుకు ఆరు గ్యారెంటీల పేరిట ఎడాపెడా అబద్ధపు హామీలివ్వటం మరొకటి. ప్రజలు అబద్ధాలను నమ్ముతారని కూడా అప్పుడు అన్నాను. అటువంటి మోసపూరిత విద్యలలో హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటకలలో అనుభవం గడించిన పండితులు మాకందులో తోడ్పడ్డారు. ఇటువంటి అబద్ధాలు, వాటితో అధికారం సంపాదించటం, వాటిని అమలుచేయకపోయినా చేశామంటూ మరిన్ని అబద్ధాలు, బుకాయింపులు, ఎదురుదాడులు మాకు మొదటి పదిహేను మాసాల కాలంలో మామూలు అయిపోయాయి.

మేము కనుగొన్న మరొక పద్ధతి గురించి కూడా చెప్పాలి మీకు. అది, ప్రజల చేత పాత అబద్ధాలను మరిపించేందుకు కొత్త అబద్ధాలాడటం. ఇటువంటి నీతి గురించి చాణక్యుడు అయినా రాసినట్లు లేదు. ఆరు గ్యారెంటీలను మరిచిపోయేందుకు మరింత ఆకర్షణీయమైన సరికొత్త గ్యారెంటీలివ్వటం ఆ పద్ధతి. అబద్ధపు గ్యారంటీలు మా ఎన్నికల విజయంలో అన్నింటికన్న ముఖ్యపాత్ర పోషించినందున, నేను రాసే 'ఆత్మకథ'లో, లేదా ఇతరులెవరైనా రాయగల నా జీవిత చరిత్రలో ఇదొక ప్రముఖమైన ప్రత్యేక అధ్యాయం కావాలి. మా ఆరాధ్యనీయుడు గాంధీజీ జీవిత కథ 'మై ఎక్స్ పెరిమెంట్స్ విత్ ట్రూత్స్' సరసన 'మై ఎక్స్‌పెరిమెంట్స్ విత్ అన్ ట్రూత్స్' పేరిట అది కలకాలం నిలిచిపోవాలి. అట్లా జరుగకుండా పది వేల మంది కేసీఆర్‌లైనా ఆపలేరన్నది నా ప్రగాఢ విశ్వాసం. ఆ విధంగా 'నా కథ', ముందుతరాలకు అనుసరణీయమవుతుంది. నా కథను నేను గాక మరెవరైనా రచించిన పక్షంలో ఈ మాటలను వారు ప్రత్యేకంగా నొక్కి చెప్పాలి. గోబెల్స్ బతికి ఉంటే ముందుమాట ఆయనతో రాయించేవాడిని.

ఇందుకు పొడిగింపుగా రాయవలసిన మరొక విషయం ఉంది. హామీల అమలు గురించిన అబద్ధాలను నేను మహారాష్ట్ర, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లి పట్టుదలగా ప్రచారం చేశాను. అక్కడి హామీల అమలు నా బాధ్యత అన్నాను. వాటిని అక్కడి ఓటర్లు నమ్మారు కూడా. మహారాష్ట్రలో మా పార్టీకి పోయినసారి కన్న తక్కువ సీట్లు వచ్చి ఓడిపోయి ఉండవచ్చుగాక. అదేవిధంగా ఢిల్లీలో గత రెండు సార్ల వలె ఈసారి కూడా సున్నా సీట్లు మేము తెచ్చుకొని ఉండవచ్చుగాక. కానీ, నేను ఓటర్లను భ్రమ పెట్టేందుకు అబద్ధాలు ఆడకపోతే, వాటిని ఓటర్లు నమ్మి ఉండకపోతే, కేవలం మా రాహుల్ గాంధీని నమ్మి ఆ మాత్రపు ఓట్లు అయినా వేసి ఉండేవారు కాదని నేను అనేక వర్గాల నుంచి విన్నాను. పైన సూచించిన అధ్యాయంలో ఇది కూడా భాగం కావాలి. అయితే నాకొక ధైర్యం ఎప్పుడూ ఉండటం గురించి చెప్పుకోవాలి. ఎన్నికల గ్యారెంటీలు అమలుకు వీలుకానివని, అధికారం కోసం చెప్పే అబద్ధాలని మా ఢిల్లీ నాయక త్వానికి ముందే తెలుసు. కనుకనే, అవి అమలు గాక ప్రజలు గగ్గోలెత్తుతున్నా వారు నిమ్మకు నీరెత్తినట్టు కూర్చున్నారు తప్ప, చిన్నపిల్లవాడు ఫోన్‌చేసినా పరుగెత్తుకురాగలమని, ఢిల్లీలో మేమే మీ ప్రతినిధులమని చేసిన ఆర్భాటాల ప్రకారం ఇటువైపు మొహమైనా చూపలేదు. అనగా వారికి అబద్ధాల గురించి తగు అవగాహన ఉందన్నమాట. పెద్ద నాయకులను ఏమీ అనగూడదు గాని, మేము తోడు దొంగలమనాలి. నా ధీమా కూడా అదే. నాకూ, వారికీ కావలసింది ఏదో ఒకవిధంగా అధికారం సంపాదించటమే గదా.

> అబద్ధాలు ఒకసారి ఒక ధోరణిగా మారినప్పుడు ఇక అన్నీ అదే మార్గంలో సాగాలని లేదు గాని, సాగించుకునే వెసులుబాటు మాత్రం నాకు లభించింది. ఆ మాటను మొదటి 15 నెలల కాలంలోనే కనుగొన్న నాకు ఎంతో ఆనందం, కించిత్ గర్వం కలిగాయి. అందుకే, 'అబద్ధాలు నడిపే అధికారం' అన్నది ఒకసారి నమూనాగా స్థిరపడిపోవటంతో రవీంద్రభారతిలో ఒకమైపు అబద్ధాలు చెప్తూనే, అబద్ధాల ప్రాతిపదికన ప్రభుత్వాన్ని నడపబోనంటూ ధైర్యంగా ప్రకటించగలిగాను. అదొక కళ. అది చతుష్షష్టి కళలలో ఉందో లేదో గాని, లేనట్లయితే చేర్చవలసి ఉంటుంది. అది నా కాంట్రిబ్యూషన్.

ఇదే అబద్ధాల సత్సంప్రదాయాన్ని కొనసాగిస్తూ గత కొద్ది రోజులలో మరొక రెండు పనులు చేశాము. బీఆర్ఎస్ సభ్యుడు జగదీశ్‌రెడ్డి ఈ నెల 14వ తేదీన అసెంబ్లీలో స్పీకర్‌ను ఏకవచనంతో సంబోధించకున్నా సంబోధించినట్టు, రికార్డులలో లేకపోయినా, ఆ పనిచేసినట్టు అబద్ధపు ఆరోపణ చేస్తూ, అధికారం ఉంది గదానని ఆయనను సస్పెండ్ చేశాం. ఆ మాటలు అన్నట్టు రికార్డయిందేమో చూపమన్నప్పటికీ చూపలేదు. లేక, అట్లా లేదు గనుక చూపలేకపోయామనుకోవచ్చు. అబద్ధాలను మెజారిటీలు నిజాలుగా మార్చటం ఎప్పుడూ ఉన్నదే కదా. అదే నీతిని పాటించాము మేము.

అబద్ధాల ప్రాతిపదికన ప్రభుత్వాన్ని నడిపే సమర్థత, నడపగలనన్న ఆత్మవిశ్వాసం నాకు పూర్తిగా ఉన్నాయనేందుకు కేసీఆర్ విషయమై నేను చూపజూసిన చమత్కారాలు తార్కాణం. నేను ఈ నెల 12న అదే రవీంద్రభారతి కార్యక్రమంలో యథేచ్ఛగా మాట్లాడుతూ, 'మీకు మీరు మాకు స్టేచర్ ఉన్నదని అనుకుంటే ఆ స్టేచర్ ఉన్నదని విర్రవీగితే, స్టేచర్ మీదకు పంపించిర్రు, ఇట్లే చేస్తే తర్వాత మార్చురీకి పోతరు' అనే కేసీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించాను. దానిపై అదే 12వ తేదీ నుంచి విమర్శలు చెలరేగాయి. అవి 13న, 14న, 15వ తేదీ మధ్యాహ్నం వరకు కొనసాగాయి. బీఆర్ఎస్ వారు 14న ఒక పోలీస్‌స్టేషన్‌లో నాపై ఫిర్యాదు కూడా చేశారు. నేను 15న అసెంబ్లీలో స్పందిస్తూ, నేను ఉద్దేశించింది వ్యక్తిగతంగా కేసీఆర్‌ను కాదు, ఆయన పార్టీనని వివరణ ఇవ్వబూనాను. అది అసత్యపు వివరణ కాని పక్షంలో ఆ వివరణను విమర్శలు వచ్చిన 12వ తేదీ నుంచి 15వ తేదీ మధ్యాహ్నం నాలుగు రోజుల కాలంలో ఎప్పుడైనా ఇచ్చి ఉండేవాడిని. కేసీఆర్ గురించి, ఆయన పాలన గురించి ఎన్నికల ప్రచారం మొదలుకొని మొత్తం 18 నెలల పాటు నూటొక్క విషయాలపై ఇటువంటి అబద్ధాలు ప్రచారం చేశాను గదా నేను.

అయితే, నా సంస్కారం నాగరికమైనది అయినట్టు నా మాటలలో ప్రతిఫలించటం మొదటి నుంచీ లేదని, లోపాలకు సవరణలు చేసుకొనే లక్షణం కూడా లేదని అందరికీ తెలిసిందే. పైగా అన్నది అనలేదని బుకాయించటం కూడా సంస్కారంలో భాగమైపోయింది. నా భాష సంస్కారవంతమైనది కాదని నాకు తెలుసు గనుకనే అసెంబ్లీ ఫలితాలు వెలువడిన వెంటనే నేను మా కార్యకర్తలతో మాట్లాడుతూ, ఇదివరకటి భాషను నా నుంచి ఇకముందు ఆశించవద్దని కోరాను. కానీ, ఒక వ్యక్తికి మొదటినుంచి అబ్బిన భాష, సంస్కారం సాధారణంగా పోయేవి కావు. అందువల్ల తర్వాత 15 మాసాలుగా, ఇంతవరకు దేశంలోని ఏ ముఖ్యమంత్రి విషయంలోనూ లేని విధంగా, అందరూ ముక్కున వేలువేసుకొని రోత పడే తీరుగా నా భాష మార్పులేకుండా కొనసాగుతూనే వస్తున్నది. నేను మాత్రం అది నాకు గర్వకారణమని నమ్ముతాను. ఓటుకు నోటు కేసు నాకు మెడల్ అయినట్లు గానే. నా జీవిత కథను మరెవరైనా రాసిన పక్షంలో, వారు నా వ్యక్తిత్వం, భాష, సంస్కారం ఇట్లా ఎందుకు రూపుదిద్దుకున్నాయో పరిశోధించినట్లయితే, నా గురించి అందరితో పాటు నాకు కూడా తగిన అవగాహన ఏర్పడుతుంది. నాకది జన్మజన్మల సార్థకత అవుతుంది కూడా.'

గురువిందగింజ తన నలుపెరుగదు

పాలు పోసి, పెంచి పోషించినంత మాత్రాన విషసర్పం కాటేయకుండా ఉంటుందా? డబ్బులు పెట్టి, పెంచి పోషించినంత మాత్రాన యూట్యూబ్ జర్నలిజం తిరగబడకుండా ఉంటుందా? ఇప్పుడు అదే జరుగుతున్నది తెలంగాణలో. నాడు పీసీసీ అధ్యక్షునిగా ఉన్న రేవంత్‌రెడ్డి స్వయంగా విషం నింపి, పెంచి పోషించిన యూట్యూబ్ జర్నలిజం ఈ రోజు ఆయనపైనే విషం కక్కుతున్నది. తన చేతుల మీదుగా పెరిగిన యూట్యూబర్స్ తన మీదనే తిరగబడుతుంటే ఆయన తట్టుకోలేకపోతున్నారు. అసహనంతో అసెంబ్లీలో ఊగిపోతున్నారు. నాడు కన్నూ మిన్నూ కానరాక తాను చేసిన వికృత క్రీడలను మరిచి, తనదాకా వచ్చేసరికి నేడు 'అధ్యక్షా..' అంటూ ఆవేదన చెందుతుండటం హాస్యాస్పదం.

రసమయి బాలకిషన్

యూట్యూబ్ జర్నలిజం, సోషల్ మీడియా జర్నలిస్టుల వల్ల లాభమో, నష్టమో చర్చించేముందు అసలు దాన్ని పెంచిందెవరు? పోషించిందెవరు? అనేది తెలంగాణ సమాజం చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. తెలంగాణ ఏర్పడిన కొత్తలో మన రాష్ట్రంలో యూట్యూబ్‌లు, రేవంత్ చెప్పే ట్యూబ్‌లు అసలున్నాయా? తన రాజకీయ లబ్ధి కోసం తెలంగాణ సమాజంలో ఈ సోషల్ విషాన్ని నింపిందెవరు? కనుగోలు వంటి టీంలను కొనుగోలు చేసిందెవరు? వాక్ స్వాతంత్ర్యం పేరిట, ప్రతిపక్షం పేరిట తెలంగాణ సాధకుడు, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై, ఆయన కుటుంబంపై విషం కక్కించిందెవరు? మార్నింగ్ న్యూస్ పేరిట మాన, మర్యాదలు మరిచి బూతు పురాణం, తిట్ల దండకంతో రెచ్చిపోయిన యూట్యూబ్ జర్నలిస్టులకు అండగా నిలిచిందెవరు? రాజ్యాంగం వారికేవో ప్రత్యేక హక్కులు కల్పించినట్టు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై నోటికి వచ్చింది వాగుతుంటే పక్కనే ఉండి సహకరించిందెవరు? బొడ్డు కోసి ఇష్టం వచ్చినట్టు పేర్లు పెడుతుంటే నవ్వులు చిందించిందెవరు? అంతవరకు ఎందుకు ప్రతిపక్ష హోదాలో ఉన్నానన్న సాయిని మరిచి మాజీ మంత్రి కేటీఆర్ తనయుడిపై మీరు బాడీ షేమింగ్ చేయలేదా? ఇప్పుడు మీదాకా వచ్చేసరికి ఆ నొప్పి తెలుస్తున్నదా? అయినా జర్నలిస్టుల పేరిట కొందరు అప్పుడు వికృతానందం పొందితే.. నేడు మీ ప్రజాపాలనలో కష్టాలు పడలేక మిమ్మల్ని ఎన్నుకున్న ప్రజలే తిడుతున్నారు. అంతే తప్ప జర్నలిస్టులు మిమ్మల్ని దూషించడం లేదు. మీ తప్పులను ఎత్తిచూపుతున్నారంతే. అంతమాత్రాన యూట్యూబ్ జర్నలిస్టుల తోడ్కులు తీస్తారా? బట్టలిప్పించి రోడ్డుపై పరిగెత్తిస్తారా?

> ప్రజాపాలన పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు మెయిన్ స్ట్రీమ్ మీడియాను గుప్పెట్లో పెట్టుకున్నది. రేవంత్ పాద ధూళిని చూసి పరవశించిపోతున్న పచ్చ మీడియా.. వాస్తవాలను వక్రీకరిస్తున్నది. నిజాలను బయటకు రానివ్వడం లేదు.

సీఎం సొంతూరు కొండారెడ్డిపల్లెలో మాజీ సర్పంచ్ ఒకరు సీఎం సోదరుల పేర్లు రాసి ఆత్మ హత్యకు పాల్పడితే... అతిపెద్ద సర్కులేటెడ్ డైలీ అని చెప్పుకొనే ఓ పేపర్ ఆ వార్తను జిల్లా ఎడిషన్‌లోని రెండో పేజీలో ప్రచురించింది. అది కూడా సీఎం సోదరుల పేర్లు రాకుండా జాగ్రత్త పడి మరీ. అదే కొండారెడ్డిపల్లెలో మహిళా జర్నలిస్టులపై సీఎం సోదరుడు కొండల్‌రెడ్డి దుశ్శాసన పర్వానికి దిగితే సీఎం ఆస్థాన మీడియా ఆ వార్తను కనీసం కవర్ చేయలేదు. కొన్ని పచ్చ పత్రికలైతే వాళ్లసలు జర్నలిస్టులే కాదని ప్రచారం చేశాయి. జర్నలిస్టులు కాకపోయినంత మాత్రాన వారిపై దాడులకు దిగుతారా? కొండారెడ్డిపల్లిలో 100 శాతం రుణమాఫీ జరిగి ఉంటే వాళ్లను కాంగ్రెస్ నాయకులే సాదరంగా ఆహ్వానించి ప్రజలతోనే నిజాలు చెప్పించవచ్చు కదా? దాడులకు తెగపడటం ఎందుకు? నిజాలను పచ్చ పత్రికలు, రేవంత్ రెడ్డి ఆస్థాన మీడియా సమాధి చేస్తున్న ప్రస్తుత తరుణంలో యూట్యూబ్, సోషల్ మీడియా జర్నలిజం వాస్తవాలను ప్రజలకు కండ్లకు కట్టేలా చూపుతున్నది. ఆ వాస్తవాలను జీర్ణించుకోలేకనే సీఎం రేవంత్‌రెడ్డి నేడు యూట్యూబర్స్‌ను క్రిమినల్స్ అని కించపరుస్తున్నారు.

మహిళా జర్నలిస్టుల అరెస్టు సందర్భంగా అసెంబ్లీలో జరిగిన చర్చ వేళ ఓ వైపు నీతులు చెప్తూనే మరోవైపు రేవంత్‌రెడ్డి జర్నలిస్టులను బట్టలిప్పదీసి కొడతానని చెప్పడం ఆయన అహంకార ధోరణికి నిదర్శనం. మహిళలపై చర్చ జరుగుతున్న సోయి మరిచి రేవంత్‌రెడ్డి మాట్లాడగా.. అతని సోదరుడు గతంలోనే తన రౌడీ మూకలతో ద్రౌపది వస్త్రాపహరణాన్ని చేసి చూపించారు. అసెంబ్లీలో ఇప్పుడు రేవంత్ రెడ్డి నీతులు చెప్తున్నారు. రెండు రోజుల ముందే కొత్తగా నియామకాలు అందుకున్న ఉద్యోగుల ఎదుట మాజీ సీఎం కేసీఆర్‌ప